ఆర్డీనరీ బస్సుల్లో ఎక్స్‌ప్రెస్ చార్జీలు..!

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, ఏప్రిల్ 7 : జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో పల్లెవెలుగు (ఆర్డీనరి) బస్సులను ఉపయోగిస్తూ ఎక్స్‌ప్రెస్ చార్జీలను వసూలు చేస్తున్న డీఎం విశ్వనాథ్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ ప్రభుత్వాన్ని, ఆర్టీసీ ఉన్నాతాధికారులను డిమాండ్ చేశారు. ఆదివారం డిపో ఆవరణలో ఆయన మాట్లాడుతూ శనివారం గోలేటి నుంచి బెల్లంపల్లి వెళ్తున్న భాగ్యనగర్ లింక్ బస్సు (పల్లెవెలుగు) ఆర్డీనరి చార్జీలు రూ.30 కాగా ఎక్స్‌ప్రెస్ చార్జీలు రూ.50 వసూలు చేశారని అన్నారు.

కాగజ్‌నగర్ ఎఫ్‌డీవోగా అప్పలకొండ

కాగజ్‌నగర్, ఏప్రిల్ 7 : కాగజ్‌నగర్ ఇన్‌చార్జి ఎఫ్‌డీవోగా అప్పకొండ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో రెండు పులుల మృతి కారణంగా ఎఫ్‌డీవో వేణుబాబును ఆయనను సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టేబ్రివాల్ ఇన్‌చార్జి ఎఫ్‌డీవో కొనసాగారు. ప్రస్తుతం ఆసిఫాబాద్ ఎఫ్‌ఆర్వోగా కొనసాగుతున్న అప్పలకొండకు రెండు నెలల్లో ఉద్యోగోన్నతి పొందనున్నట్లు తెలుస్తున్నది. ఈ క్రమంలోనే ఇన్‌చార్జి ఎఫ్‌డీవోగా బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం.

హ్యాండ్‌బాల్ నూతన కార్యవర్గం ఎన్నిక

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 7: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం సీసీసీ నస్పూర్‌లో అసోసియేషన్ జనరల్‌బాడీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా సీసీసీ నస్పూర్‌కు చెందిన పెంచాల శ్రీధర్, కార్యదర్శిగా తుండ్ల శ్రీనివాస్, కోశాధికారిగా తూర్పాటి వెంకటేశ్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ అబ్జర్వర్లు విష్ణువర్ధన్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సభ్యులు మారయ్య, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి రాంచందర్, కార్యవర్గ సభ్యులు గడ్డం సాయికుమార్, శీలం సాయికుమార్, రాంపురం నరేశ్, ప్రేమసాయి, కౌశిక్‌రావు, రేవెల్లి మహేశ్, సంధ్య, జిల్లా హ్యాండ్‌బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

పండుగ పూట..పస్తులు

- వేతనాలు అందక కాగజ్‌నగర్ మున్సిపల్ కార్మికుల ఇబ్బందులు
- అందని పీఎఫ్, ఈఎస్ఐ
- సమస్యలు పరిష్కరించాలని ఉన్నతాధికారులకు విన్నపం

కాగజ్‌నగర్ పట్టణం

కాగజ్‌నగర్, ఏప్రిల్ 7: రెక్కాడితే కాని ...డొక్కాడని మున్సిపల్ కార్మికులకు పండుగ పూట పస్తులు తప్పడం లేదు. చాలీ చాలనీ వేతనాలతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా కార్మికులకు ప్రతి నెలా సక్రమంగా వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నారు. ప్రతి నెలా వేతనాలు అందక అప్పులపాలైన కార్మికులకు అప్పుపుట్టే పరిస్థితి కూడా కానరావడం లేదు. అప్పులు తీర్చలేక, పిల్లల స్కూల్ ఫీజు చెల్లించలేక కార్మికులు సతమతం అవుతున్నారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులు 15 వేల నివాసాలు, సుమారు 60 వేల జనాభా ఉన్నది. పారిశుధ్యం, విద్యుత్ సరఫరా, వాటర్ సప్లయ్, బిల్ కలెక్టర్, అటెండర్, పార్కులు, తదితర విభాగాల్లో 179 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. పట్టణంలో నిత్యం 21 మెట్రిక్ టన్నుల చెత్తా చెదారం వెలువడుతున్నది. వేకువజామున 4:30 గంటలకు విధుల్లో చేరి మున్సిపల్ కార్మికులు చెత్తా చెదారాన్ని వాహనాల్లో డంప్ యార్డుకు 7 ట్రాక్టర్లు, 20 ఆటో ట్రాలీల్లో తరలిస్తుంటారు. పట్టణంలో అన్ని వాడల్లో శుభ్రం చేసి ప్రజల ఆరోగ్యాలను కార్మికులకు చాలీ చాలని వేతనాలతో బతుకులు వెల్లదీస్తున్నారు. రెండు నెలల వేతనం, 9 ఎన్‌ఎంఆర్ కార్మికులకు నాలుగు నెలల వేతనాలు అందాల్సి ఉంది. పెండింగ్‌లో ఉన్నా వేతనాలు వెంటనే చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు చెల్లించాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ఇటీవల ఆందోళన చేపడితే అధికారులు, పాలకవర్గం స్పందించి ఒక నెల వేతనం చెల్లించారు. ప్రతి నెలా వేతనాలు చెల్లించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

ఈఎస్ఐ, పీఎఫ్ అమలులోనూ జాప్యం..

కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వర్తించే కార్మికుల బతుకులకు భరోసా లేకుండా పోయింది. మున్సిపాలిటీలో విధులు నిర్వర్తించే కార్మికులకు ప్రతి నెలా రూ.16600 వేతనం పొందుతున్నారు. అందులోంచి ఈఎస్ఐ, పీఎఫ్ రూ.2000 కోత విధిస్తుంటారు. కానీ ఆ డబ్బులు ఆయా సంస్థలకు చెల్లించడం లేదు. దీంతో ఈఎస్ఐ సౌకర్యం అందని ద్రాక్షగా మారింది. ప్రైవేట్‌లో వైద్యం కోసం వెళ్లి ఆర్థికంగా తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని కార్మికులు వాపోతున్నారు. ఇటు పీఎఫ్ డబ్బులు అందడం లేదు. 5 రోజుల క్రితం ఇప్పమల్లు కార్మికురాలు ఆరోగ్య సమస్యతో మృతి చెందింది. 14 సంవత్సరాలు మున్సిపాలిటీలో సేవలందించినప్పటికీ ఆమెకు సంబంధించిన పీఎఫ్ డబ్బులు అందలేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నలుగురు కార్మికులు మృతి చెందినప్పటికీ వారికి కూడా అందాల్సిన బెనిఫిట్స్ అందలేదని కార్మికులు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వర్తించే కార్మికులకు చెందిన ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులు రూ.కోట్ల వరకు పెండింగ్‌లో ఉంది. పెండింగ్‌లో ఉన్నా ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులు వెంటనే చెల్లించి కార్మికుల బతుకులకు భరోసా కల్పించాలని కార్మికులు కోరుతున్నారు.

కాగజ్‌నగర్ పట్టణంలో చెత్త సేకరిస్తున్న కార్మికులు

ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించాలి

ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడంలో అధికారులు చాలా జాప్యం చేయడం సరికాదు. మృతి చెందిన కార్మికులకు పీఎఫ్ డబ్బులు అందడం లేదు, ఈఎస్ఐ వైద్యం కూడా అందడం లేదు. దీంతో కార్మికులంతా ప్రైవేట్‌లో వైద్యం చేయించుకొని ఆర్థికంగా నష్ట పోతున్నారు. ఇటీవల ఓ మహిళ కార్మికురాలు మృతి చెందినప్పటికీ ఆమెకు అందాల్సిన బెనిఫిట్స్ ఇప్పటికీ అందలేదు. అధికారులు స్పందించి కార్మికులకు అందాల్సిన బెనిఫిట్స్ అందించి, వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి.

- ఇరిగిరాల శంకర్, కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రతి నెలా వేతనాలు చెల్లించాలి

ప్రతి నెలా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వేతనాల కోసం ధర్నాలు, ఆందోళనలు చేస్తే తప్ప అరకొర వేతనాలు చెల్లిస్తున్నారు. మూడు నెలల వేతనం పెండింగ్‌లో ఉంటే వేతనం కోసం కార్యాలయం ఎదుట ఆందోళన చేపడితే ఒక నెల వేతనం చెల్లించారు. వేతనాలు సక్రమంగా అందకపోవడంతో పండుగ పూట పస్తులుండాల్సిన దుస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా అధికారులు, పాలకవర్గం స్పందించి ప్రతి నెలా వేతనం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి.

- బోగర్ల సంజీవ్, కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలి

- సీఐ సాదిక్ పాషా

సీఆర్పీఎఫ్ జవాన్లతో మార్చ్ ఫాస్ట్ నిర్వహిస్తున్న సీఐ సాదిక్ పాషా

కౌటాల, ఏప్రిల్ 7 : రాబోయే ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కౌటాల సీఐ సాదిక్ పాషా అన్నారు. జిల్లా ఎస్పీ సురేశ్ కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం మండల కేంద్రంతో పాటు తలోడి, యాపల్‌గూడ, కోయగూడ గ్రామాల్లో సీఆర్పీఎఫ్ జవాన్లతో మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా, భయాందోళనలకు గురిచేసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. ఆయన వెంట కౌటాల ఎస్ఐ మధుకర్, పోలీసులున్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి

వినతి పత్రం అందజేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు

దహెగాం, ఏప్రిల్ 7: మిషన్ భగీరథలో పని చేస్తున్న కార్మికులకు వెంటనే వేతనాలు విడుదల చేయాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి ఆదివారం వినతి పత్రం అందజేశారు. నాలుగు నెలలుగా వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వం వెంటనే వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తిరుపతి, నాగరాజ్, అశోక్, బాబురావు, లక్ష్మణ్, నవీన్, లచ్చన్న, సురేశ్, వెంకటేశ్, కృష్ణ, రాజయ్య, విజయ్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జా

పీహెచ్‌సీ ముందు ప్రభుత్వ స్థలంలో అక్రమంగా వేసిన కంచె

పెంచికల్‌పేట్, ఏప్రిల్ 7 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ప్రభుత్వ స్థలాన్ని ఆదివారం నలుగురు వ్యక్తులు కబ్జా చేసి అక్రమంగా కంచె ఏర్పాటు చేశారు. కబ్జాను పంచాయతీ కార్యదర్శి ఆపేందుకు ప్రయత్నించాడు. అయినా వినకుండా కంచె ఏర్పాటు చేశారని పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. ఈ విషయంపై అక్రమ ఫెన్సింగ్ తొలగించేందుకు సహకారం కోరుతూ మండల రెవెన్యూ, పంచాయతీ రాజ్ ,ప్రజా పరిషత్, పోలీస్ శాఖకు ఫిర్యాదు చేశారు.

ఆవు యజమానికి తక్షణ సాయం

బెజ్జూర్, ఏప్రిల్ 7 : పులి దాడిలో మరణించడంతో బాధిత యజమాని గుర్రె శంకర్‌కు తక్షణ సహాయం కింద రూ.5 వేలను ఆదివారం మండల కేంద్రంలోని రేంజ్ కార్యాలయంలో అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వన్య ప్రాణులతో నష్టం జరిగితే బాధితులు పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వన్య ప్రాణులకు హానీ కలిగించవద్దని కోరారు. బెజ్జూర్ అటవీ ప్రాంతం ఇటీవల వన్య ప్రాణుల సంచారంతో ఊహించని పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని అందుకని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారి శ్రీనివాస్, బీట్ అధికారి అనిత పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కాసిపేట, ఏప్రిల్ 7 : క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక దృఢత్వానికి ఎంతో దోహపడుతాయని వైస్ ఎంపీపీ పూస్కూరి విక్రం రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కాసిపేట మండలంలోని ముత్యంపల్లి క్రీడా మైదానంలో బోయిని పెద్ద గొల్ల భీమయ్య యాదవ్ స్మారక మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ టోర్నీలో 12 జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, ఏనుగు తిరుపతిరెడ్డి, దాసరి శంకర్, పెద్ద గొల్ల రాయలు, మారం లచ్చన్న, వేల్పుల రవి, రేశవేణి మల్లయ్య, పంబాల భీరయ్య, పంబాల చంద్రయ్య, వేల్పుల పోశం, వేల్పుల బలరాం, పాలగాని రాములయ్య, పోలవేని పోశం, పుట్ట శ్రీనివాస్, బోయిని రాజన్న, రామన్న, గుమ్ముల అశోక్, సాయి పాల్గొన్నారు.

ఘనంగా సంత్ రామారావు విగ్రహ ప్రతిష్ఠాపన

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఖానాపూర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ పూజలు

రామారావు విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఖానాపూర్ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్

జన్నారం, ఏప్రిల్ 7 : బంజారా ఆరాధ్యదైవమైన సంత్ రామారావు విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని మండలం కేంద్రంలోని పొనకల్ జువ్విగూడ గ్రామ సమీపంలో ప్రభుత్వ బాలుర పాఠశాల ఎదుట ఘనంగా నిర్వహించారు. జగదాంబ ఆలయం నుంచి ఊరేగింపుగా బంజారా బాలికలు, మహిళలు వచ్చి తీజ్ వేడుకలు, భోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ప్రేమ్‌సింగ్ మహారాజ్, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజక వర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్, ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, ఆదిలాబాద్ జడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అజ్మీరా శ్యాంనాయక్, ఎంపీపీ మాదాడి సరోజన, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ సుతారి వినయ్, కోఅప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సులువ జనార్దన్, మండల అధ్యక్షుడు ముజఫర్ అలీఖాన్, సయ్యద్ ఇసాక్, ఎం రాజా శేఖర్, ఏనుగు సుభాష్‌రెడ్డి, జీ మోహన్‌రెడ్డి, ఎ భీంలాల్‌నాయక్, బీ రాములునాయక్ బంజారా సేవాసమితి సంఘం నాయకులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతులను మోసం చేసి రూ.18 వేలు కాజేసిన దుండగులు

జన్నారం, ఏప్రిల్ 7 : మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన సామల రాజవ్వ బచ్చయ్య వృద్ధ దంపతుల ఇంటికి గుర్తుతెలియని ఇద్దరు నంబర్ ప్లేట్‌లేని బైక్‌పై వచ్చి వారి ఇంటి పక్కన కొత్తగా ఇల్లు కడుతున్న వ్యక్తి రాజేందర్ డబ్బులు ఇమ్మనాడని నమ్మబలికి వారి నుంచి రూ.18 వేలు తీసుకొని వెళ్లిపోయారు. కొద్దిసేపటికి రాజేందర్ అక్కడికి రాగా 'నీ పేరు చెప్పి ఇద్దరు వచ్చి రూ.18 వేలు తీసుకెళ్లారు' అని వృద్ధ దంపతులు తెలిపారు. తాను డబ్బుల కోసం ఎవరినీ పంపలేదని చెప్పడంతో ఆందోళనకు గురయ్యారు. మోసపోయామని గ్రహించి బోరున విలపించారు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచ్ జాడి గంగాధర్ సమాచారం చేరవేయడంతో పోలీసులు వారిని పట్టుకోవడానికి గాలింపు చర్యలు చేపటినట్లు తెలిపారు.

కిడ్నాప్ చేసి..రూ. 6వేలు అపహరించి..

మంచిర్యాల ఏసీసీ 7 :జిల్లా కేంద్రంలో మ్యాదరివాడ మ్యాక్స్ బవన్ వద్ద బస్సు దిగి వెళ్తున్న వ్యక్తిని ఇద్దరు వ్యక్తులు ఆటోలో కిడ్నాప్ చేసి కత్తితో బెదిరించి డబ్బులు కాజేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి వివరాల ప్రకారం స్థానిక రాంనగర్‌కు చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి బొగ్గు మల్లేశ్ ఈ నెల 6న సాయంత్రం లక్షెట్టిపేటలో శుభకార్యానికి వెళ్లి వచ్చి ఇంటికి వెళ్లేందుకు మ్యాక్స్ భవన్ వద్ద దిగి నడుస్తుండగా ఎదురుగా వచ్చిన ఆటోలో ఉన్న ఇద్దరు వ్యక్తులు మల్లేశ్‌ను బెదిరించి కిడ్నాప్ చేసి ఎత్తుకెళ్లారు. కొంత దూరం తీసుకెళ్లి కత్తితో బెదిరించి మల్లేశ్ వద్ద నుంచి రూ. 6వేలు నగదు దోచుకున్నాడు. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై సీఐ బన్సీలాల్‌ను వివరణ కోరగా బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దోపిడీకి పాల్పడిన వారిని అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.

శ్రీరాంపూర్‌లో కార్డెన్ సెర్చ్

శ్రీరాంపూర్, ఏప్రిల్ 7: శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణాకాలనీలో ఎస్ఐ సంతోష్ ఆధ్వర్యంలో ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. వాహనాల పత్రాలను తనిఖీ చేశారు. నేరాలను నియంత్రించడానికి కాలనీల్లో నీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్, పోలీసులున్నారు.

కన్నెపల్లిలో..

కన్నెపల్లి, ఏప్రిల్ 7 : కన్నెపల్లి మండలంలోని లింగాల గ్రామంలో తాండూర్ సీఐ కుమారస్వామి ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామాల్లోని వాహనాలకు సంబంధించిన పత్రాలను తనిఖీలు చేశారు. గ్రామాల్లోకి ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం కన్నెపల్లి నుంచి లింగాల వరకు రోడ్డుపై ఉన్న కల్వర్టులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కన్నెపల్లి ఎస్ఐ గంగారాం, పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి రిమాండ్

కౌటాల, ఏప్రిల్ 7 : మండలంలోని బాలేపల్లికి చెందిన ఇద్దరిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మధుకర్ ఆదివారం తెలిపారు. బాలెపల్లికి చెందిన కోబ్రగడే దీప్‌చంద్‌పై గత నెల 27 అర్ధరాత్రి అదే గ్రామానికి చెందిన జాడి బాలు, జాడి ప్రియాంక గొడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గతంలో జాడి ప్రియాంక, దీప్‌చంద్ మధ్య అక్రమ సంబంధం ఉన్నదని పలుమార్లు గ్రామంలో పంచాయితీలయ్యాయి. తమ వైవాహిక జీవితానికి దీప్‌చంద్ అడ్డుగా వస్తున్నాడని భావించి బాలు, ప్రియాంక దీప్‌చంద్‌ను చంపాలనే ఉద్దేశ్యంతో అతనిపై గొడ్డలితో దాడి చేశారు. బాధితుడి చెల్లి జాడి కల్పన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు నిందితులిద్దరినీ రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ మధుకర్ తెలిపారు.

టోల్ ప్లాజా చెక్ పోస్టు వద్ద రూ.60 వేల నగదు పట్టివేత

వాంకిడి, ఏప్రిల్ 7:పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని టోల్ ప్లాజా చెక్ పోస్టు వద్ద ఆదివారం సాయంత్రం వాహనాలు, తనిఖీ చేస్తుండగా సరైన ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.60వేల నగదును పట్టుకున్నట్లు వాంకిడి ఎస్ఐ సాగర్ తెలిపారు. ఆసిఫాబాద్ మండలం జెండాగూడకు చెందిన జాడి అశోక్ కారులో ఆసిఫాబాద్ వైపు నుంచి వాంకిడి వస్తుండగా అతని వద్ద నుంచి రూ.60వేలు పట్టుబడినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. సరైన ఆధారాలు లేని కారణంగా నగదును సీజ్ చేసి ఎస్ఎస్టీ టీమ్‌కు అప్పగించినట్లు తెలిపారు.

బస్ షెల్టర్లు లేక..సమయానికి బస్సులు రాక..

- ఎండలో ప్రయాణికుల తిప్పలు

మందమర్రి, ఏప్రిల్ 7 : మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని యాపల్, పాత బస్టాండ్ ఏరియాలలో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు సమయానికి బస్సులు రాక పోవడంతో పడిగాపులు కాయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందమర్రి పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు నిత్యం వివిధ అవసరాలపై మంచిర్యాలతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు యాపల్ ఏరియా, పాత బస్టాండ్ ఏరియాలో బస్సులు ఎక్కి ప్రయాణిస్తుంటారు. నాలుగు వరుసల రహదారి నిర్మాణంతో పాటు ప్లైఓవర్‌ను ఎన్‌హెచ్ఏఐ అధికారులు నిర్మించారు. రోడ్డు వెడల్పులో గతంలో పాత బస్టాండ్‌తో పాటు యాపల్ ఏరియాలో బస్ షెల్టర్లను అధికారులు

ఎన్‌హెచ్ఏఐ అధికారులకు వినతి పత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పాతబస్టాండ్‌లో బస్సు కోసం ఫ్లైఓవర్ వంతెన కింద వేచిఉన్న ప్రయాణికులు

తొలగించారు. ప్లై ఓవర్ నిర్మాణం పనులు పూర్తి కావస్తుండగా ఇరువైపులా పాసింగ్ రోడ్డు పనులు పూర్తయ్యాయి. అయినప్పటికీ ప్రభుత్వ అధికారులు, ఎన్‌హెచ్ఏఐ అధికారులు బస్ షెల్టర్ల నిర్మాణం విషయాన్ని పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. బస్ షెల్టర్లను నిర్మించాలని కోరుతూ గత నెలలో బీఆర్ఎస్ నాయకులు జాతీయ రహదారుల నిర్మాణ సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) అధికారులకు వినతి పత్రం సమర్పించారు. బస్ షెల్టర్లు లేక ప్రయాణికులకు బస్సుల కోసం ఎండలో వేచి ఇబ్బందులు పడాల్సి వస్తుందని వినతి పత్రంలో పేర్కొన్నారు.

సింగరేణి

నేడు ఎస్సార్పీ-3,1 గనులపై బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ సమావేశం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 7 : ఈ నెల 8న ఉదయం 7 గంటలకు శ్రీరాంపూర్ ఏరియా ఎస్సార్పీ-3,1 గనులపై బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సమావేశం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ నస్పూర్ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, టీబీజీకేఎస్ కేంద్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు పెట్టం లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈ సమావేశానికి టీబీజీకేఎస్ కేంద్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. కార్మికులు, యూనియన్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

టీబీజీకేఎస్ సభ్యత్వ నమోదు

సభ్యత్వం అందిస్తున్న ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు

రెబ్బెన, ఏప్రిల్ 7: టీబీజీకేఎస్ స్టీరింగ్ కమిటీ నిర్ణయం ప్రకారం సింగరేణి ఉద్యోగుల నుంచి టీబీజీకేఎస్ సభ్యత్వ నమోదు ప్రారంభించటం జరిగిందని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్ లోని టీబీజీకేఎస్ కార్యాలయంలో ఆదివారం సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ నెల 24న గోదావరిఖనిలో టీబీజీకేఎస్ జనరల్ బాడీ సమావేశం ఉంటుందని, అందులో అధ్యక్ష ప్రధాన కార్యదర్శులతో పాటు సెంట్రల్ కమిటీ, గనుల స్థాయి కమిటీ ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ నాయకులు ధరావత్ మంగీలాల్, ఏరియా నాయకులు మారిన వెంకటేశ్వర్లు, జర్పుల మంగీలాల్, జూనియర్ తిరుపతి, మోరే సత్యనారాయణ, సుగ్రీవులు, సాగర్, శంకర్, ఓరం కిరణ్, దేవేందర్ పలువురు ఉన్నారు.

'బూట్లు కడిగి ఆరబెట్టు..'

- మహిళా ఉద్యోగిని ఆదేశించిన అధికారి..!
- సోషల్ మీడియాలో వైరల్

మందమర్రి, ఏప్రిల్ 7 : మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలోని కేకే-5 గనిలో పని చేస్తున్న ఓ మహిళా ఉద్యోగినిని అదే గనికి చెందిన అధికారి వేధింపులకు గురి చేస్తున్నాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కేకే-5 గని ఆఫీస్ సూపరింటెండెంట్ ఓ మహిళా ఉద్యోగిని తన బూట్లు కడిగి ఆరబెట్టాలని ఆదేశించడంతో.. ఆమె భయపడి ఆ పని చేసినట్లు తెలిసింది. ఈ విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. సింగరేణి ఉన్నతాధికారులు విచారణ జరిపి సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృతి

మందమర్రి, ఏప్రిల్ 7: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడి తీవ్ర గాయాలైన సింగరేణి కార్మికుడు వెంకటేశ్వర్లు మృతి చెందాడు. మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం..మందమర్రిలోని ఒకటవ జోన్ కాలనీకి చెందిన పాయల్ వెంకటేశ్వర్లు మందమర్రి ఏరియాలోని ఆర్కే ఓసీలో ఫిట్టర్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో పాత బస్టాండ్ నుంచి మార్కెట్ వైపు వస్తుండగా రామన్ కాలనీ సమీపంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై బైక్ అదుపు తప్పి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని అంబులెన్స్‌లో సింగరేణి దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వెంకటేశ్వర్లు భార్య చంద్రకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రెబ్బెన, ఏప్రిల్ 7: సింగరేణి లోని కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. హైదరాబాద్‌లో సత్యనారాయణరెడ్డిభవన్‌లో ఆదివారం జరిగిన ఏఐట